RNI No :TELTEL2022/83073

# వేద న్యూస్

వరంగల్
సంపుటి : 3, సంచిక : 232 | బుధవారం ఆగస్టు 13, 2025 | పేజీలు : 4 వెల : రూ.3-00


దినపత్రిక



సైబర్ నేరాల్లో తెలంగాణ టాప్
4లో..



కరీమాబాద్ ప్రభుత్వ ప్రాథమిక ఉన్నత పాఠశాల





# వరదకు వణికిన వరంగల్..!?

- లోతట్టు ప్రాంతాలు జలమయం
- కుంటలను తలపించేలా రోడ్లు
- నీట మునిగిన నగరం
- సహాయక చర్యల్లో అధికార యంత్రాంగం

**వేద న్యూస్, ఓరుగల్లు :**

సోమవారం రాత్రి నుంచి కురిసిన భారీ వర్షానికి ఓరుగల్లు నగరం వణికింది.! నగరంలో పలుచోట్ల జనం తీవ్ర ఇక్కట్లు ఎదుర్కొన్నారు. మంగళవారం ఉదయం నుంచే అధికార యంత్రాంగం సహాయక చర్యల్లో తల మునకలైంది.

**- జలమయమైన రహదారులు**

భారీ వర్షానికి రహదారులు మొత్తంగా నీటితో నిండిపోయాయి. కుంటలను తలదన్నేలా మారి.. వాహనదారులు ప్రజలకు ఇబ్బందులు ఎదురయ్యాయి. వరంగల్ అండర్ బ్రిడ్జి ప్రాంతం తో పాటు రైల్వే స్టేషన్ నీటి మునిగి.. వరదలోనే ఉన్నట్టుగా కనిపించాయి. పోలీస్ శాఖ అధికారులు, సిబ్బంది, ఇతర శాఖల యంత్రాంగం సహాయక చర్యలను ముమ్మరంగా చేపడుతున్నాయి. మిల్స్ కాలనీ పోలీసులు.. వరదలో చిక్కుకున్న చిన్నారులను కాపాడి ప్రజల చేత శభాష్ అనిపించుకున్నారు. కాగా, వరంగల్ నగరంలో రోడ్లు ఇతర మౌలిక వసతుల కల్పనపై ప్రణాళికాబద్ధంగా, మరింత పకడ్బందీగా వ్యవహరించాలని నగరవాసులు కోరుతున్నారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగు చర్యలను ముందస్తుగానే తీసుకోవాలని, తద్వారా ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఉంటాయని ప్రజలు అభిప్రాయపడ్డారు.



నీట మునిగిన ప్రాంతాలను పరిశీలించిన ట్రాఫిక్ ఏసీపీ సత్యనారాయణ, ఇంతేజార్ గంజ్ సీఐ షుకూర్.



సహాయ చర్యల్లో పాల్గొన్న మిల్స్ కాలనీ పోలీసులు

# ఏసీబీ వలలో సర్వేయర్ సునీల్..!

**వేద న్యూస్, పెద్దపల్లి :**



పెద్దపల్లి జిల్లాలో అవినీతి తిమింగలం ఏసీబీ అధికారులకు పట్టుబడింది. ఓ రైతు నుండి పదివేల రూపాయలు లంచం తీసుకుంటూ మండల సర్వేయర్ ఏసీబీ అధికారులకు అడ్డంగా బుక్ అయిన సంఘటన జిల్లాలో చోటుచేసుకుంది. నాగార్జున రెడ్డి అనే రైతు ఫోన్ పే నుండి మండల సర్వేయర్ అకౌంట్ కు పదివేల రూపాయలు ట్రాన్స్ఫర్ చేయగా ఏసీబీ అధికారులు వలపన్ని పట్టుకున్నారు. సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. పెద్దపల్లి తహసీల్దార్ కార్యాలయంలో పని చేస్తున్న సర్వేయర్ పెంద్యాల సునీల్ ఫోన్ పే ద్వారా రూ.10వేలు లంచం తీసుకుంటుండగా బుధవారం ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. తహసీల్దార్ కార్యాలయంలో ఏసీబీ అధికారుల విచారణ ప్రారంభించారు. నాగార్జున రెడ్డి రైతు నుండి భూమి సర్వే చేసి పంచానమా ఇవ్వడానికి రూ.10వేలు సర్వేయర్ సునీల్ డిమాండ్ చేయగా సదరు రైతు ఏసీబీ అధికారులను సంప్రదించారు. ఏసీబీ అధికారుల సూచనల మేరకు సర్వే యర్ సునీల్ అకౌంట్ ఫోన్ పే ద్వారా రూ.10 వేలు ట్రాన్స్ఫర్ చేశారు.

# మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలి

- కలెక్టర్ సందీప్ కుమార్ ఝా



**వేద న్యూస్, వేములవాడ :**

విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా పేర్కొన్నారు. వేములవాడ మున్సిపల్ పరిధిలోని మహాత్మా జ్యోతిబాపూలే రెసిడెన్షియల్ స్కూల్ అండ్ కాలేజ్ గర్ల్స్ విద్యాలయాన్ని కలెక్టర్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. కిచెన్ స్టోర్ రూమ్ లలో తిరిగి, స్వయంగా గరిటతో వంటకాలను కలిపి వాటి నాణ్యతను, ల్యాబ్, లైబ్రరీ, ఆట స్థలమును పరిశీలించారు. విద్యార్థులతో హాస్టల్

మిగతా 2వ పేజీలో..

# ఎకో టూరిజం పై ఫోకస్

- వనరులు సద్వినియోగం చేసుకునేలా ప్రణాళికలు రూపొందించండి
- అటవీ శాఖపై రివ్యూ మీటింగ్ లో సీఎం రేవంత్

**వేద న్యూస్, హైదరాబాద్ ప్రతినిధి :**



రాష్ట్రంలో ఎకో టూరిజం అభివృద్ధిపై దృష్టి సారించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. సింగపూర్ వంటి దేశాల్లో 30 ఎకరాల్లోనే నైట్ సఫారీలు ఉన్నాయని, మనకు భారీ విస్తీర్ణాల్లో అటవీ ప్రాంతాలు..అందులోనే నదులు, జలపాతాలు ఉన్నందున ఆ వనరులను సద్వినియోగం చేసే ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. అటవీ శాఖపై కమాండ్ కంట్రోల్ సెంటర్ (ఐసీసీసీ) లో మంత్రి కొండా సురేఖతో కలిసి ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించి పలు ఆదేశాలు జారీ చేశారు. అమ్రాబాద్, కవ్వాల్ టైగర్ రిజర్వ్ ఫారెస్టులున్నా తెలంగాణ వాసులు ఇతర రాష్ట్రాల్లోని బందీపూర్, తడోబా వంటి ప్రాంతాలకు పులుల సందర్శనకు వెళుతున్నారు. అమ్రాబాద్, కవ్వాల్ టైగర్ రిజర్వ్ ఫారెస్టులకు సందర్శకుల సంఖ్య పెంచేలా సౌకర్యాలు

మిగతా 4వ పేజీలో..

# ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- కలెక్టర్ డా.సత్య శారద



**వేద న్యూస్, వరంగల్ ప్రతినిధి :**

భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తం గా ఉండాలని వరంగల్ జిల్లా కలెక్టర్ డా.సత్య శారద అన్నారు.

సోమవారం రాత్రి కురిసిన భారీ వర్షాలకు జలమయమైన వరంగల్ నగరం లోని పలు ప్రాంతాలలో బల్దియా కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ తో కలిసి క్షేత్ర స్థాయి లో సందర్శించి సమర్థవంతం గా చర్యలు చేపట్టుటకు అధికారులకు తగు సూచనలు చేశారు. ఈ సందర్భం గా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా పరిధి లోని నాలుగు మండలాలలైనా వరంగల్ సంగెం ఖిలా వరంగల్ వర్ధన్నపేట లలో అత్యధిక వర్షపాతం నమోదు కావడం జరిగిందని, అత్యధికంగా సంగెం మండలంలో 24 సెంటీమీటర్ల వర్షపాతం, ఖిలా వరంగల్ మండలం లో 15 సెంటీమీటర్ల వర్షపాతం నమోదు కావడం జరిగిందని జలమయమైన లోతట్టు ప్రాంతాలైన సాయి గణేష్ కాలనీ, గాంధీ నగర్,డి కే నగర్,లెనిన్ నగర్, అగర్తల చెరువు ప్రాంతం,

మిగతా 2వ పేజీలో..

# ఎమ్మెల్యే విజయ్ చంద్రకు కృతజ్ఞతలు తెలిపిన పిఏసిఎస్ ఛైర్మన్లు

**వేద న్యూస్, పార్వతిపురం మన్యం జిల్లా ప్రతినిధి :**

పార్వతీపురం నియోజకవర్గం సీతానగరం మండలం గెడ్డలుప్పి, తామర కండి ప్రాథమిక వ్యవసాయ పరపతి సహకార సంఘం అధ్యక్షులుగా నియమతులైన చొంగల సింహాచలం, యమల శ్రీరామలునాయుడు డైరెక్టర్లు భోగి అప్పలనాయుడు వెన్నెల శంకర్రావు, అంటిపేట పిఏసిఎస్ చైర్మన్ ఎగిరెడ్డి భాస్కరనాయడు తదితరులు ఎమ్మెల్యే బోనెల విజయ్ చంద్రకు కృతజ్ఞతలు తెలియజేశారు. మంగళవారం ఉదయం టిడిపి పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యేను కలిసి పూలమాలతో సత్కరించి ధన్యవాదాలు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎమ్మెల్యే విజయ్ చంద్ర సహకారంతో తమకు పదవులు వచ్చాయని వాటిని రైతుల కోసం ఉపయోగించి ప్రభుత్వానికి ముఖ్యంగా ఎమ్మెల్యే విజయ్ చంద్రకు మంచి పేరు తీసు కొస్తామని స్పష్టం చేశారు. పిఏసిఎస్ చైర్మన్లు, డైరెక్టర్లు గా ఎంపికైన నాయకులకు ఎమ్మెల్యే విజయ్ చంద్ర శుభాకాంక్షలు తెలియజేశారు. రైతులకు మంచి సేవలు అందించి ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని ఎమ్మెల్యే



సూచించారు.

# భారీ గిరి నాగు కలకలం



**వేద న్యూస్, పార్వతీపురం మన్యం జిల్లా ప్రతినిధి :**

కురుపాం మండలం కిచ్చాడా గ్రామంలోని ఓ ఇంటి బాత్రూంలో కింగ్ కొబ్రా హల్చల్ చేసింది. ఆగురు శివ బాత్రూం డోర్ తెరిచేసరికి కింగ్ కొబ్రా కనపడటంతో భయాందోళనకు గురై ఫారెస్ట్ రెంజర్ గంగరాజుకు సమాచారం ఇచ్చాడు. వెంటనే స్పందించి స్నేక్ పాటించి ఫారెస్ట్ రేజర్ అడవిలో వదిలి పెట్టారు.

# మధ్యాహ్న భోజన పథకం ప్రైవేటీకరణ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలి

**వేద న్యూస్, పార్వతీపురం మన్యంజిల్లా ప్రతినిధి :**



ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం ప్రారంభం తరువాత పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెరగటమేగాక బడి మానేసే పిల్లల సంఖ్య గణనీయంగా తగ్గినట్టు ప్రభుత్వ లెక్కలు తెలుపుతున్నాయని ఏపి మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు జి.వరలక్ష్మి అన్నారు. మంగళవారం ఏపీ మధ్యాహ్న భోజనం యూనియన్ జిల్లా రెండోవ మహాసభ పార్వతీపురం స్థానిక సుందరయ్యభవనంలో జరిగింది. మొదటగా యూనియన్ జిల్లా అధ్యక్షులు జి.తులసి సిఐటియు జెండాను ఆవిష్కరించారు. తులసి అధ్యక్షతన జరిగిన సమావేశంలో జిల్లా కార్యదర్శి బి.శాంతకుమారి గత మూడు మూడు సంవత్సరాల సంఘ నిర్మాణం, పోరాటాల, కార్యక్రమాల నివేదికను ప్రవేశపెట్టారు. సిఐటియు జిల్లా అధ్యక్ష కార్యదర్శులు డి.రమణారావు, వై.మన్మధరావు, జిల్లా ఉపాధ్యక్షులు వి.రామలక్ష్మి, జిల్లా కోశాధికారి గొర్లి వెంకటరమణ మహాసభలో ఉన్నారు. ఈ సందర్భంగా జి.వరలక్ష్మి మాట్లాడుతూ బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఈ పథకాన్ని అనేక ప్రాంతాల్లో ప్రైవేట్ సంస్థలకు అప్పగించే కుట్రలు పన్నుతున్నారని పేర్కొన్నారు. దేశంలో 25 లక్షల మంది, రాష్ట్రంలో 85వేల మంది మధ్యాహ్న భోజన కార్మికులు పనిచేస్తున్నారని, దేశంలోని 12 కోట్ల మంది పిల్లలకు మధ్యాహ్న భోజనం సిద్ధం చేసి దేశ భవిష్యత్తును సిద్ధం చేసే పనిలో నిమగ్నమై ఉన్నారని తెలిపారు. మధ్యాహ్నో భోజనం నిర్వాహకుల్లో నిరు పేద కుటుంబాలకు చెందిన మహిళలే ఎక్కువగా ఉన్నారని, వీరిలో అధిక శాతం వితంతువులు, ఒంటరి మహిళలలేనని అన్నారు. మహిళ సాధికారత కల్పిస్తామని జపంచేస్తున్న కేంద్ర ప్రభుత్వం గత 11 ఏళ్లుగా మధ్యాహ్న భోజన కార్మికుల గౌరవ వేతనాన్ని పెంచకపోవడం చాలా బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు.

ఈ కార్యక్రమంలో జిల్లా వ్యాప్తంగా గల అన్ని మండలాల నుండి మధ్యాహ్నం భోజనం కార్మికులు పాల్గొన్నారు. అనంతరం నూతన కమిటీ ఎన్నుకున్నారు. జిల్లా నూతన అధ్యక్షులు జి.తులసి, ప్రధాన కార్యదర్శి వై.శాంతికుమారి కోశాధికారి కె.మీనాకుమారి జిల్లా కమిటీ సభ్యులుగా యు.లక్ష్మి, కె.ఉష, పావని, కళ్యాణి, సుశీల, గౌరమ్మ, రజిని, సావిత్రమ్మ, షబానాను ఎన్నుకున్నారు.

# ప్రకృతి వ్యవసాయ బయో గ్రామాలు బలోపేతం చేయాలి

## – డీపీఎం శ్రవణ్ కుమార్ నాయుడు

**వేద న్యూస్, పార్వతీపురం మన్యం జిల్లా ప్రతినిధి :**



మన్యం జిల్లా సాలూరు మండల వ్యవసాయ ఎడిఏ కార్యాలయంలో ప్రకృతి వ్యవసాయ జిల్లా ప్రాజెక్ట్ అధికారి ఎమ్. శ్రవణ్ కుమార్, సీనియర్ కన్సల్టెంట్ డాక్టర్ డి. పారినాయుడు ప్రకృతి వ్యవసాయ డివిజనల్ సమీక్ష సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ మక్కువ, సాలూరు, పాచిపెంట మండలాలకు చెందిన ప్రకృతి వ్యవసాయ యూనిట్ ఇంచార్జిలతో బయో గ్రామాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రకృతి వ్యవసాయ ప్రభందుకులు శ్రవణ్ కుమార్ నాయుడు మాట్లాడుతూ కేంద్రం ప్రభుత్వం అనుభందశాఖ అయినటువంటి నీతి అయోగ్ మన్యం జిల్లాను ప్రకృతి వ్యవసాయ ఆశజనక జిల్లాగా ఎంపిక చేయడం గర్వకారణంగా ఉందని, ఇందుకు ప్రతీ ప్రకృతి వ్యవసాయ కార్యకర్త రైతులకు అందుబాటులో ఉంటూ వారు ప్రకృతికి హాని చేసే విధమైన విష పదార్థాలు ఉపయోగించకుండా చూడవలసిన బాధ్యత మన అందరిపై ఉందన్నారు. సహజ పంటలు పండించుకుని ప్రకృతిని భూమాతను, సకల జీవరాశు లను, అందరి ఆరోగ్యాలను కాపాడవలసిన అవసరం ఉందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకృతి వ్యవసాయానికి అధిక ప్రాధాన్యం ఇవ్వడం ఆనందకరమైన విషయమని ఆయన అన్నారు. మక్కువ సాలూరు పాచిపెంట మండలాల్లో కొన్ని గిరిజన గ్రామాలను మోడల్ గ్రామాలుగా ఎంపిక చేయడం జరిగిందన్నారు. అదేవిధంగా జిల్లాలో అధిక గ్రామాలను బయో గ్రామాలుగా మార్చడానికి ప్రణాళికలు తయారు చేసి అందరి సహకారంతో ఆచరించేందుకు ప్రయత్నం చేయడం జరుగుతుందన్నారు. ఈ సమీక్ష సమావేశానికి అధ్యక్షత వహించిన డాక్టర్ డీ పారినాయుడు మాట్లాడుతూ గతంలో 2018 సంవత్సరంలో కురుపాం మండలంలోని కొండ బారిడి గ్రామంలోని మొత్తం 72 మంది రైతులు వారి యొక్క పూర్తి విస్తీర్ణం 262 ఎకరాలు ఏ విధమైన రసాయన ఎరువులు పురుగు మందులు వాడకుండా సహజంగా లభించే వనరులను నవధాన్యాలను జీవామృతాలను ఉపయోగించుకొని జరిగిందన్నారు. అదేవిధంగా ఈ సంవత్సరం సాలూరు డివిజన్ పరిధిలో ఉన్నటువంటి కొన్ని గ్రామాల్లో బయోగ్రామాలుగా బలోపేతం చేయాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎఫ్ఏ దేవి ప్రసాద్, మాస్టర్ ట్రైనర్ .పి.యశోదమ్మ మరియు ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

# దగ్ధమైన గోడౌన్ పరిశీలించిన ఎమ్మెల్యే

**వేద న్యూస్,మెట్ పల్లి ప్రతినిధి :**



జగిత్యాల జిల్లా మెట్ పల్లి పట్టణ కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో దగ్ధమైన గన్ని సంచిల గోడౌన్ ను పరిశీలించిన కోరుట్ల ఎమ్మెల్యే డా.కల్వకుంట్ల సంజయ్. ఈ సందర్భంగా మాట్లాడుతూ మెట్ పల్లి ఆర్డీవో కు పలు సూచనలు చేశారు.పక్కన కాలనీ వాసులు నివాసం ఉన్నందున అధికారులు క్షేత్రస్థాయిలో ఉండి ఎప్పటికప్పుడు పర్యవేక్షించుకుంటూ ముందు ముందు ఎటువంటి నష్టం జరగకుండా మళ్లీ ఇలాంటి సంఘటనలకు తావు లేకుండా అధికారులు చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే కోరారు.రెండు రోజుల నుండి మంటలు ఆర్పడానికి కష్టపడుతున్న అగ్నిమాపక సిబ్బందికి మున్సిపల్ సిబ్బందికి ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మెట్ పల్లి ఆర్డీవో శ్రీనివాస్,మున్సిపల్ కమిషనర్ మోహన్, ఇబ్రహీంపట్నం ఎమ్మార్వో వరప్రసాద్,వ్యవసాయ మార్కెట్ చైర్మన్ గోవర్ధన్, బీఆర్ఎస్ పార్టీ నాయకులు మారు సాయిరెడ్డి, ఆకుల ప్రవీణ్, మొరపు తేజ,జెడి సుమన్,సాగర్,భూమేష్,శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

మైసయ్య నగర్, గిరి ప్రసాద్ కాలనీ, పద్మ నగర్, శాకారాశికుంట తదితర ప్రాంతాల్లో క్షేత్ర స్థాయిలో సందర్శించడం జరిగిందని వర్షపు నీరు బయటకు వెళ్లే స్ట్రాం వాటర్ డ్రైన్ లు ఇరుకుగా ఉండడం వల్ల నీటి ప్రవాహం లో ఇబ్బందుకు ఏర్పడు తున్నాయని, ఖిలావరంగల్ నుండి వరంగల్ వరకు జీ డబ్ల్యూఎంసి తరపున అట్టి నాలా ను విస్తరించడానికి పనులు కొనసాగుతున్నాయని, లోతట్టు ప్రాంతాలలో ఎమర్జెన్సీ ప్లాన్ కింద చర్యలు చేపట్టడం జరుగుతుందని అన్నారు. మంగళవారం రాత్రి వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ ఆదేశాల మేరకు లోతట్టు ప్రాంతాల్లో ఉండే ప్రజలు పునరావాస కేంద్రాలకు తరలి వెళ్లాలని లోతట్టు ప్రాంతాలలో ఉండే ప్రజల కోసం ఆహారంతో పాటు వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో మందులు అందుబాటులో ఉంచడం జరిగిందని, ప్రస్తుత క్లిష్ట పరిస్థితులు నేపథ్యంలో పిల్లలను పాఠశాలకు పంపించవద్దని ముఖ్యంగా భారీ వర్షాలు కురిసే క్రమంలో ప్రాణహాని ఉంటుందని కావున పిల్లలను చేపల వేటకు వెళ్లకుండా తల్లిదండ్రులు నియంత్రించాలని, విద్యుత్ సంబంధ వస్తువులను తాగకుండా ఉండాలని సూచించారు. వర్షాలు కురిసే క్రమంలో ఎర్తింగ్ వచ్చే అవకాశం ఉంటుందని భారీగా నీరు నిలిచి ఉండే లోతట్టు ప్రాంతాలకు విద్యుత్తు నిలిపివేయడం జరిగిందని, ఒకరోజు పునరవస కేంద్రాలలో ఆవాసం పొందడం వల్ల కలిగే నష్టం ఏమీ లేదని రాష్ట్ర విపత్తు నిర్వహణ అథారిటీ వారు అందజేసిన సాటిలైట్ ఇమేజ్ లో మరో రెండు రోజులపాటు వర్షాలు కురుస్తాయని సమాచారం అందిందని ప్రజలు అప్రమత్తం గా ఉండాలని కలెక్టర్ అన్నారు. బల్దియా కమిషనర్ మాట్లాడుతూ జీడబ్ల్యూఎంసి తరపున డిఆర్ఎఫ్ బృందాలు అప్రమత్తం గా ఉన్నాయని ప్రతి వార్డులో జవాన్ తో పాటు ప్రత్యేక మాన్ సూన్ బృందాలు అందుబాటులో ఉన్నాయని అంతే కాకుండా ఇంజనీరింగ్ బృందాలు కూడా క్షేత్ర స్థాయి లో సంసిద్ధంగా ఉన్నారని అన్నారు. వర్షపు నీటిని వేగవంతంగా బయటకు పంపించడానికి కచ్చా కాలువల ద్వారా పంపించడం జరుగుతుందని,శాశ్వత పరిష్కారం కోసం నాలా ను విస్తరించడం తో పాటు డ్రైన్ ఆక్రమణలను తొలగించడం జరుగుతుందని లోతట్టు ప్రాంతాల్లో ఉన్న ప్రజలు సమీప ప్రాంతాల్లో ఉన్న పునరావాస కేంద్రాల్లోకి వెళ్లాలని సూచించారు. ప్రస్తుతం 6 పునరావాస కేంద్రాలు ఎస్ ఆర్ నగర్ లో శుభం గార్డెన్,గాంధీ నగర్, మైసయ్య నగర్ కమ్యూనిటీ హాల్ లో,డి కే నగర్ లో బీరన్నకుంట హై స్కూల్ ,గిరి ప్రసాద్ నగర్ లోని కమ్యూనిటీ హాల్,ఎం ఎన్ నగర్ లోని మార్వాడీ హాల్ లో లను ఏర్పాటు చేయడం జరిగిందని ప్రస్తుతం ఆయా కేంద్రాలలో ప్రజలు ఆవాసం పొందుతున్నారని ఉదయం సుమారు 1300 మందికి అల్పాహారం అందజేయడం జరిగిందని లంచ్ తో పాటు డిన్నర్ కూడా అందజేస్తామని ప్రజల అవసరాల కోసం వరంగల్,హన్మకొండ కలెక్టరేట్ లతో పాటు బల్దియా ప్రధాన కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ను ఏర్పాటు చేసి టోల్ ఫ్రీ నెంబర్ : 18004251980,మొబైల్ నంబర్: 9701999676 అందుబాటు లోకి తెచ్చామని ప్రజలు ఈ నంబర్ లలో సంప్రదించాలని జీ డబ్ల్యు ఎం సి తరఫున 2 డిఆర్ఎఫ్ బృందాలు 24 గంటలు మూడు షిఫ్టులలో పనిచేస్తున్నాయని కమిషనర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్లు భోగి సువర్ణ సురేష్, మారుపల్ల రవి, అదనపు కలెక్టర్ సంధ్యా రాణి,డి ఏం%డ%హెచ్ ఓ సాంబశివరావు ఎన్పిడిసిఎల్ ఎస్ ఈ గౌతమ్ రెడ్డి, ఆర్ డి ఓ సత్యపాల్ రెడ్డి సి ఏం హెచ్ ఓ డా.రాజారెడ్డి డి ఎఫ్ ఓ శ్రీధర్ రెడ్డి, ఏం హెచ్ ఓ డా.రాజేష్ ఈ ఈ సంతోష్ బాబు డిఎఫ్ ఓశంకర్ లింగం, తహసీల్దార్ లు మహమ్మద్ ఇక్బాల్ నాగేశ్వర్ రావు తదితరులు పాల్గొన్నారు.

# మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలి

వసతులు నాణ్యమైన భోజనం పెడుతున్నారా? అని%ఎ%విద్యార్థులను సౌకర్యాలు గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు.

అనంతరం విద్యాలయంలోని 9,10, ఇంటర్మీడియట్ విద్యార్థులకు ఫిజిక్స్, మ్యాథ్స్ ఎకనామిక్స్, ఇంగ్లీష్ పాఠాలను బోధించి పలు ప్రశ్నలు అడిగి సమాధానాలు రాబట్టారు. కొందరు టీచర్లు విద్యార్థులకు సక్రమంగా పాఠాలు బోధించలేకపోవడం గమనించి, వారికి సూచనలు చేసి, కలెక్టర్ సందీప్ కుమార్ ఝా మాట్లాడారు. క్లాస్ రూమ్ కి వెళ్లే ఉపాధ్యాయులు ముందుగా సంబంధిత సబ్జెక్టు పై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. విద్యార్థులకు సక్రమంగా పాఠాలు బోధించాలని ఆదేశించారు. దీంతో విద్యార్థులకు సబ్జెక్ట్ పై పూర్తి స్థాయిలో పట్టు వస్తుందని తెలిపారు. మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం విద్యార్థులకు అందించాలని సూచించారు. పాఠశాలకు అవసరమైన 30 బెంచీలను ఇతర విద్యాలయాల నుండి తెప్పించవలసిందిగా, ప్రతినిత్యం జిల్లా విద్యాధికారి తనిఖీలు నిర్వహించవలసిందిగా డి.ఈ.ఓ ని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్యామల,ఉపాధ్యాయులు,విద్యార్థులు తదితరులు ఉన్నారు.



# ఘనంగా ఏఐఎస్ఎఫ్ 90వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

**వేద న్యూస్, ఇల్లంతకుంట:**



ఇల్లంతకుంట మండలం ఏఐఎస్ఎఫ్ జిల్లా సమితి ఆధ్వర్యంలో 90 వ ఆవిర్భావ దినోత్సవం పునస్కరించుకుని స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ముందు ఏఐఎస్ఎఫ్ మండల అధ్యక్షులు బండారి చందు గౌడ్ జెండా ఆవిష్కరణ చేసారు. ఇట్టి కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా ఉపాధ్యక్షులు పెండెల ఆదిత్య హాజరై మాట్లాడుతూ.

భారత దేశ స్వాతంత్ర్యమే లక్ష్యంగా దేశంలోనే మొట్టమొదటి విద్యార్థి సంఘంగా ఉత్తరప్రదేశ్ రాజధాని లక్నో మహానగరంలో భగత్ సింగ్, రాజ్ గుర్, సుఖ్ దేవ్, ఆజాద్ ల ఇంకా ఎందరో వీరుల ఆశయ సాధన కోసం బబ్రుద్దీన్, ప్రేమ్ నారాయణ భార్గవ్ల నాయకత్వాన 1936 ఆగస్టు12న ఏఐఎస్ఎఫ్ ఆవిర్భవించింది. బ్రిటీష్ సామ్రాజ్యవాదుల బానిసచేర నుంచి మాతృభూమి విముక్తి కై సాగిన వీరోచిత స్వాతంత్ర్య ఉద్యమంలో పొత్తిళ్లలోనే పిడికిళ్లు బిగించి స్వాతంత్ర్యము మా జన్మహక్కు అని మా అంతం చూసిన - స్వాతంత్ర్యోద్యమ పంతం వీడం అంటూ నినదించి భారతదేశానికి సంపూర్ణ స్వాతంత్ర్యం కావాలని, భరతమాత బానిస సంకెళ్ళ నుంచి విముక్తి కావాలని ఎందరో విద్యార్థుల విప్లవ కిషోరులను బలిదానం చేసిన ఘనమైన చరిత్ర కలిగిన దేశములోనే ఏకైక విద్యార్థి సంఘం ఏఐఎస్ఎఫ్ అన్నారు. పోరాటాలు, త్యాగాలే ధ్యేయంగా ఏర్పాటైన ఈ విద్యార్థి సంఘం స్వాతంత్ర్య అనంతరం ప్రభుత్వ విద్యా పరిరక్షణకై, శాస్త్రీయ విద్య, కామన్ విద్యావిధానం అమలుపై నిరంతరం పోరాటాలు సాగిస్తూ 89 సంవత్సరాలుగా విద్యార్థుల శ్రేయస్సు కోసం అశేష త్యాగాలు చేస్తూ ఆవిర్భావం నాటి నుంచి నేటి వరకు గల్లి నుండి డిల్లీ వరకు విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఉద్యమాలే ఊపిరిగా - పోరాటాలే ప్రాణంగా - విద్యారంగ సమస్యల పరిష్కారమే ధ్యేయంగా చదువుతూ పోరాడుతాం - చదువుకై పోరాడుతాం అంటూ తెలంగాణ రైతాంగ పోరాటంలో, విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు అని వీరోచిత పోరాటం,18 సంవత్సరములకు ఓటుహక్కు ఉద్యమం, బి.ఈ డి లో బి.సి ఓ ఎం విద్యార్థులకు అవకాశం, మలిదశ తెలంగాణ పోరాటంలో,హాస్టళ్ల సమస్యలపై, విద్య వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న పాలకులపై అలుపెరుగని సమరశీల పోరాటాలు చేసి దేశంలో ఎన్నో విజయాలు సాధించింది ఏఐఎస్ఎఫ్. శాస్త్రీయ సోషలిజం తన గమ్యంగా, ప్రభుత్వ విద్యను, సెక్యులరిజాన్ని, ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించుకోవడం తన కర్తవ్యమని, సమరశీల విద్యార్థి ఉద్యమాల నిర్మాణంలో నిమగ్నమైన అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) 89 వసంతాలు పూర్తిచేసుకుని 90వ సంవత్సరంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు. భవిష్యత్తులో జిల్లా వ్యాప్తంగా విద్యార్థుల సమస్యలపై సమశీల పోరాటాలకు సిద్ధం అవ్వండని పిలుపునిచ్చారు. ఈ కార్యమంలో సొల్లు సాయి, దొమ్మాటి శ్రీహరి, గండ్లా అనిల్, రామ్ చరణ్, సన, కీర్తన మరియు కళాశాల విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



# నీట మునిగి వృద్ధురాలు మృతి..!

**వేద న్యూస్, వరంగల్ టౌన్:**

వరంగల్ నగరంలోని కాశికుంటలో భారీ వర్షం కారణంగా విషాదం చోటుచేసుకుంది. సోమవారం రాత్రి కురిసిన కుండపోత వర్షానికి ఓ ఇంట్లోకి నీరు చేరడంతో, కింద నిద్రపోతున్న 80 ఏళ్ల వృద్ధురాలు పసునూరి బుచ్చమ్మ నీటిలో మునిగి అక్కడికక్కడే మరణించారు. ఈ ఘటనపై మిల్స్ కాలనీ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



# విద్యార్థులకు ఐడి కార్డులు పంపిణీ

**వేద న్యూస్, ఇబ్రహీంపట్నం:**

ఇబ్రహీంపట్నం మండలంలోని డబ్బా ప్రాథమిక ఉన్నత పాఠశాల విద్యార్థులకు మంగళవారం ఐడి కార్డులను పంపిణీ చేశారు. డబ్బా గ్రామానికి చెందిన ఆర్ఎంపీ పిఎంపీల మండల ప్రధాన కార్యదర్శి డాక్టర్ శ్రీధర్ తన సొంత డబ్బులు 6500 తో విద్యార్థులకు ఐడి కార్డులను అందజేశారు. పాఠశాల ఉపాధ్యాయుల ప్రోత్సాహంతో విద్యార్థులకు ఐడి కార్డులను అందజేయడం జరిగిందని శ్రీధర్ వివరించారు. రానున్న రోజులలో ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెరిగి నాణ్యమైన విద్యను పొందుకోవాలని కోరారు. విద్యార్థులపై ఉపాధ్యాయులు చూపుతున్న ప్రత్యేక శ్రద్ధపై ఉపాధ్యాయులను అభినందించారు. కాగా డాక్టర్ శ్రీధర్ ను ఉపాధ్యాయులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పుప్పాల నర్సయ్య, నేరెళ్ల సత్యం గౌడ్, సాదాల మహేష్, బైండ్ల విశాల్, మాజీ ఉపసర్పంచ్ కోటి దేవరెడ్డి, ప్రధానోపాధ్యాయులు తనుగుల రమేష్, అల్లకట్టు సత్యనారాయణ, మండలోజీ అశోక్, నరేష్, శంకర్, హరి ప్రసాద్, రాజేష్ ,తదితరులు పాల్గొన్నారు.

# బీజేపీ శ్రేణుల అక్రమ అరెస్టులను ఖండించండి

**వేద న్యూస్, మఠంపల్లి :**



తెలంగాణ రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాలనను చూస్తుంటే రజాకార్ల పాలన తలపిస్తుందని హిందువు దేవాలయాలను ధ్వంసం చేయడంతో పాటు హిందువులను అక్రమ అరెస్టులు చేయడం దారుణం అని బి జె పి గిరిజన మోర్చా జిల్లా నాయకుడు బానోతు రంగా నాయక్ అన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ నిజాం పాలను తలపించేలా కాంగ్రెస్ ప్రభుత్వపాలన కొనసాగుతుందని ఆయన అన్నారు. హిందువుల దేవాలయాలను పడగొట్టిన, పూజలను అడ్డుకున్న మతోన్మాదులకు అండగా నిలబడ్డ కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పుడు వాళ్ళ లక్ష్యాన్ని భుజాన ఎత్తుకుంది అని మండిపడ్డారు. తెలంగాణ అంతటా పెద్దమ్మకి పెద్దబోనం అందజేస్తుంటే బంజారా హిల్స్ పెద్దమ్మ గుడి కూల్చేసి,అమ్మవారి విగ్రహాన్ని దొంగతనం చేయడం దారుణమన్నారు. తమ ఆరాధ్య దైవమైన పెద్దమ్మ తల్లి ఆలయాన్ని కాపాడుకునేందుకు బిజెపి, హిందూ సమాజం ఒక యుద్ధమే చేసింది, విజయం సాధించింది. అయినా కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పుడు అక్కడ పూజలను అడ్డుకుంటోంది ,బంజారా హిల్స్ పెద్దమ్మ గుడి లో నిర్వహించనున్న కుంకుమార్చన కార్యక్రమానికి జిల్లా నుండి బయలుదేరుతుంటే అక్రమ అరెస్టులు చేయడం సిగ్గుచేటని ఆయన ప్రభుత్వంపై మండిపడ్డారు.

# పోగొట్టుకున్న మొబైల్ ఫోన్ అందజేత



**వేద న్యూస్, శాయంపేట:**

శాయంపేట గ్రామానికి చెందిన ముడతలపెల్లి గోవర్ధన్ సోమవారం తన సెల్ ఫోన్ ని పత్తిపాక గ్రామ మార్కెట్ లో పోగొట్టుకోగా బాధితుడు వెంటనే పత్తిపాక గ్రామ పోలీస్ అధికారి అయిన హెడ్ కానిస్టేబుల్ రవీందర్ కి చెప్పటం తో కానిస్టేబుల్స్ ఖలీద్, సతీష్ సహాయం తో పత్తిపాక గ్రామం లో ఇటీవల పెట్టించిన సీసీ కెమెరాలలో పోగొట్టుకున్న సెల్ ఫోన్ ని గుర్తించి బాధితునికి అప్పగించారు. పోగొట్టుకున్న సెల్ ఫోన్ ని తొందర్లో పోలీసులు స్పందించి అప్పగించడంతో బాధితుడు గ్రామ ప్రజలు పోలీసు వారికి కృతజ్ఞతలు తెలిపారు.

# సబ్ సెంటర్ ను సందర్శించిన వైద్య ఆరోగ్యశాఖ అధికారి



**వేద న్యూస్, శాయంపేట :**

శాయంపేట మండలంలోని ప్రగతి సింగారం సబ్ సెంటర్ ను జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి అల్లం అప్పయ్య సందర్శించారు . అనంతరం సబ్ సెంటర్ పరిధిలో టీబి (క్షయవ్యాధి) ట్రీట్మెంట్ పొందుతున్న ముగ్గురు రోగులకు న్యూట్రిషన్ కిట్ లు అందచేశారు.ఈ కార్యక్రమంలో మండల వైద్యాధికారి ఎన్ సాయి కృష్ణ ,ప్రగతి సింగారం ఏ ఎన్ యం, ఆశాలు పాల్గొన్నారు.

# ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలి




**-సీపీ సన్ ప్రీత్ సింగ్**

**వేద న్యూస్, వరంగల్ క్రైమ్:**

రానున్న 72 గంటల్లో భారీ స్థాయిలో వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరించింది. కావున వరంగల్ కమిషనర్ పరిధిలోని ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ ప్రజలకు సూచించారు. ముఖ్యంగా లోతట్టు ప్రాంతాల్లో నివసించే ప్రజలు సురక్షిత ప్రాంతాలకు తరలి పోవాలని అలాగే శిదిలావస్థలో వున్న భవనాలు, ఇండ్లల్లో నివసించే వారు సైతం సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని పోలీస్ కమిషనర్ సూచించారు. భారీ వర్షాల కారణంగా పోలీస్ కమిషనర్ ప్రజలకు పలు సూచనలు చేస్తూ అత్యవసరం ఉంటేనే బయటకు రావాలి,వెదర్ అప్డేట్స్ ఫాలో అవుతూ పనులు షెడ్యూల్ చేసుకోవాలని, వర్షంలో వాహనంపై ప్రయాణించే వారు వాహనాల కండీషన్ పరిశీలించుకోవాలన్నారు. వాహనదారులు నిదానంగా డ్రైవింగ్ చేయాల్సి వుంటుందని, అలాగే భారీ వర్షాలున్నప్పుడు బయటకు రావొద్దని, ముఖ్యముగా వర్షం కురుస్తున్న సమయంలో చెట్ల కింద నిలబడటం ప్రమాదకరమని,విద్యుత్ స్థంబాల దగ్గర్లో నిలబడటం, తాకడం చేయద్దని పోలీస్ కమిషనర్ ప్రజలకు సూచించారు. ఏదైనా విపత్కర పరిస్థితులు ఏర్పడితే తక్షణమే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు.

# అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తి చేయాలి

**వేద న్యూస్, పెద్దపల్లి జిల్లా :**



పెద్దపల్లి జిల్లాలో పంచాయతీరాజ్ శాఖ ద్వారా చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాల పెండింగ్ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు. పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ శాఖ పై సమీకృత జిల్లా కలెక్టరేట్ లో కలెక్టర్ కోయ శ్రీ హర్ష సమీక్ష నిర్వహించారు. సిసి రోడ్లు, ఆసుపత్రి మరమ్మత్తులు, సబ్ సెంటర్ల నిర్మాణం పనులు పురోగతి వివరాలను తెలుసుకొని పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ..జిల్లాలోని హెల్త్ సెంటర్స్ మరమ్మత్తు పనులు, సబ్ సెంటర్ భవనాలు, పాఠశాలల మరమ్మత్తు, కాంపౌండ్ వాల్ నిర్మాణ పనులు, రెసిడెన్షియల్ పాఠశాలల ,హాస్టల్స్ మరమ్మత్తు పనులకు నిధులు మంజూరు చేయడం జరిగిందని, అందుబాటులో ఉన్న నిధులను వినియోగించుకుంటూ పనులు వేగవంతంగా పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ శాఖ తరపున మంజూరు చేసిన అభివృద్ధి పనులు త్వరగా గ్రౌండ్ అయ్యేలా చూడాలని అన్నారు. పంచాయతీరాజ్ శాఖ ద్వారా పూర్తిచేసిన అభివృద్ధి పనులకు సంబంధించి బిల్లుల చెల్లింపు సకాలంలో జరిగేలా చూడాలని తెలిపారు. ఈ సమావేశం నందు ఈఈ పంచాయతీరాజ్ గిరీష్ బాబు, సిపిఓ రవీందర్, కలెక్టరేట్ ఏవో శ్రీనివాస్, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ఇచ్చిన హామీలను అమలు చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం



**వేద న్యూస్, మఠంపల్లి :**

ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం అమలు చేసిందని యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ మాజీ అధ్యక్షులు గంగసాని యల్లారెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని బక్కమంతుల గూడెంలో ప్రభుత్వం మంజూరు చేసిన నూతన రేషన్ కార్డులను స్థానిక నాయకులతో కలసి పంపిణి చేశారు. ఈ కార్యక్రమంలో చింతారెడ్డి భాస్కర్ రెడ్డి, గ్రామశాఖఅధ్యక్షులు సోమిరెడ్డి గోవిందరెడ్డి, బలుపునూరి వీరారెడ్డి, ముడేం చిన్నరాంరెడ్డి, మాబు తదితరులు పాల్గొన్నారు.

# అమెరికాలో రోడ్డు ప్రమాదం.. హైదరాబాద్ విద్యార్థిని మృతి

**వేదన్యూస్ డెస్క్:**

అమెరికాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో హైదరాబాద్‌కు చెందిన విద్యార్థిని శ్రీజ వర్మ దుర్మరణం చెందింది. భారత కాలమానం ప్రకారం సోమవారం రాత్రి ఆమె తన అపార్ట్‌మెంట్ నుంచి భోజనం కోసం కారులో రెస్టారెంటుకు వెళ్లింది. తిరిగి వస్తుండగా కారును ఒక ట్రక్కు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో శ్రీజ తీవ్రంగా గాయపడి మృతి చెందింది. ప్రమాదం జరిగిన సమయంలో ఆమె స్నేహితురాలు కూడా కారులో ఉన్నట్లు సమాచారం. శ్రీజ వర్మ అమెరికాలో ఎంఎస్ పూర్తి చేసింది. సిద్దిపేట జిల్లా రామారుకల గ్రామానికి చెందిన శ్రీనివాస్ వర్మ, హేమలత దంపతులకు శ్రీజ వర్మ, శ్రేయ వర్మ అనే ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఈ కుటుంబం హైదరాబాద్‌కు వలస వచ్చింది. వారు మేడ్చల్ జిల్లా గండిమైసమ్మ చౌరస్తా సమీపంలోని శ్రీకృష్ణనగర్‌లో నివాసము ంటున్నారు. శ్రీనివాస్ వర్మ డ్రైవర్‌గా పని చేస్తుండగా, ఆయన భార్య ఓ ప్రైవేటు సంస్థలో ఉద్యోగం చేస్తోంది. చిన్నకూతురు శ్రేయా వర్మ కూడా ఎంఎస్ చేసేందుకు 20 రోజుల క్రితం అమెరికా వెళ్లింది.

వేద న్యూస్



# ఎకో టూరిజం పై ఫోకస్

కల్పించాలన్నారు. అటవీ, రెవెన్యూ శాఖల మధ్య భూ వివాదాల పరిష్కారానికి కలెక్టర్లు ప్రత్యేక శ్రద్ధ వహించి సంయుక్త సర్వే చేపట్టాలి. వరంగల్ కాకతీయ జూ అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించాలి. హైదరాబాద్ తర్వాత రాష్ట్రంలో పెద్ద నగరమైన వరంగల్‌లో జూ ను ప్రభుత్వ-ప్రైవేటు భాగస్వామ్యంతో అభివృద్ధి చేసేందుకు ఉన్న అవకాశాలపై అధ్యయనం చేయాలని సూచించారు. అటవీ జంతువుల దాడిలో మృతిచెందిన లేదా గాయపడిన వారికి, పశువులు, పెంపుడు జంతువులు కోల్పోయిన వారికి తక్షణమే పరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని అందుకు సీఎంఆర్‌ఎఫ్ నుంచి అవసరమైన మేరకు నిధులు వినియోగించుకోవాలని తెలిపారు.

అటవీ శాఖ పరిధిలో చేపడుతున్న రహదారులు, ఇతర అభివృద్ధి పనులకు అవసరమైన అనుమతుల విషయంలో అటవీ శాఖ, ఆయా పనులు చేపడుతున్న శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలి. కేంద్ర అటవీ, పర్యావరణ శాఖ నుంచి అనుమతులను సాధ్యమైనంత త్వరగా సాధించాలన్నారు. అడవుల్లో వన్య ప్రాణుల సంరక్షణ, వాటి కదలికలను గమనించేందుకు ఏర్పాటు చేసిన కెమెరాలన్నింటిని కమాండ్ కంట్రోల్ సెంటర్ కు అనుసంధానించాలి. అటవీ శాఖలో అధికారుల కొరతను దృష్టిలో పెట్టుకుని రాష్ట్రానికి తగిన సంఖ్యలో ఐఎఫ్ఎస్ అధికారుల



కేటాయింపుపై కేంద్రంతో సంప్రదించాలని సూచించారు. అటవీ శాఖలో ప్రమోషన్లు, ఉద్యోగాల భర్తీకి సంబంధించిన ప్రతిపాదనలను తక్షణమే సిద్ధం చేయాలని శాఖలో ఉత్తమ పని తీరు కనబరిచే వారికి అవార్డులను ఇచ్చే ప్రక్రియను పునరుద్ధరించాలన్నారు. ఈ సమావేశంలో అటవీ శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# రానున్న 72 గంటలు అప్రమత్తంగా ఉండండి

## - రాష్ట్ర మంత్రి కొండా సురేఖ

**వేద న్యూస్, వరంగల్ టౌన్:**

వరంగల్ జిల్లాలో రానున్న 72 గంటలు జిల్లా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర మంత్రి కొండా సురేఖ సూచించారు. వరంగల్ జిల్లాలోని అన్ని విభాగాల ఉన్నతాధికారులు ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు రాకుండా అన్ని చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఎంతటి భారీ వర్షాలు వచ్చినా ప్రాణ నష్టం వాటిల్లకుండా చూడాలని ఆదేశాలు జారీ చేశారు. లోతట్టు ప్రాంతాలు, వాగులు, వంకలపై వంతెనలపై నుంచి రాకపోకలు లేకుండా చూడాలని మంత్రి సురేఖ సూచించారు. ఎక్కడైనా ప్రమాదవశాత్తూ చిక్కుకుంటే వారిని తక్షణమే బయటకు తీసుకువచ్చే ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. అదే సమయంలో జన నష్టం, పశు నష్టం వాటిల్లకుండా చూడాలన్నారు. రానున్న 72 గంటల్లో తెలంగాణవ్యాప్తంగా భారీ నుంచి అతి భారీ వర్షాలు పడతాయనే వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో వర%శీ%గల్ ఉమ్మడి జిల్లా



కలెక్టర్లకి ఇచిన నివేదిక ఆధారంగా మంత్రి ఆయా జిల్లా ఉన్నతాధికారులను మంత్రి సురేఖ ఆదేశించారు. అతి భారీ వర్షాలు కురుస్తాయనే హెచ్చరికలు ఉన్న ప్రాంతాల్లో ఏమైనా ఇబ్బందులు తలెత్తితే ప్రభుత్వాన్ని సంప్రదించి తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు.

# సైబర్ నేరాల్లో తెలంగాణ టాప్

- సైబర్ నేరాల్లో దేశంలోనే తెలంగాణకు అగ్రస్థానం - జాతీయ సగటు కంటే పది రెట్లు అధికంగా క్రైమ్ రేటు
- వెల్లడించిన జాతీయ నేర గణాంకాల సంస్థ (ఎన్‌సీఆర్‌బీ) - నేరాల కట్టడికి కేంద్ర ప్రభుత్వం పలు చర్యలు

**వేదన్యూస్ డెస్క్:**




సైబర్ నేరాల విషయంలో తెలంగాణ రాష్ట్రం దేశంలోనే అత్యధికంగా అప్రతిష్ఠను మూటగట్టుకుంది. దేశవ్యాప్తంగా నమోదవుతున్న సైబర్ క్రైమ్ రేటుతో పోలిస్తే తెలంగాణలో దాదాపు 10 రెట్లు అధికంగా ఉండటం ఆందోళన కలిగిస్తోంది. ఈ షాకింగ్ విషయాలను జాతీయ నేర గణాంకాల సంస్థ (ఎన్‌సీఆర్‌బీ) మంగళవారం విడుదల చేసిన 2022 మధ్యంతర డేటా వెల్లడించింది. ఎన్‌సీఆర్‌బీ గణాంకాల ప్రకారం, దేశవ్యాప్తంగా సైబర్ క్రైమ్ రేటు సగటున 4.8 శాతంగా ఉండగా, తెలంగాణలో ఇది 40.3 శాతంగా నమోదైంది. దీంతో ఈ జాబితాలో తెలంగాణ అగ్రస్థానంలో నిలిచింది. దక్షిణాది రాష్ట్రాల్లోనే సైబర్ నేరగాళ్లు ఎక్కువగా క్రియాశీలంగా ఉన్నట్లు ఈ నివేదిక సూచిస్తోంది. తెలంగాణ తర్వాత కర్ణాటక రెండో స్థానంలో ఉంది. ఇతర రాష్ట్రాల విషయానికొస్తే, మహారాష్ట్రలో సైబర్ క్రైమ్ రేటు 6.6 శాతంగా నమోదు కాగా, ఆంధ్రప్రదేశ్‌లో 4.4, అసోంలో 4.9, ఉత్తరప్రదేశ్, ఒడిశాలలో 4.3 శాతం చొప్పున ఉంది. పెద్ద రాష్ట్రాల్లో పశ్చిమ బెంగాల్ కేవలం 0.4 శాతం క్రైమ్ రేటుతో మెరుగైన స్థానంలో నిలవడం గమనార్హం. కేంద్ర పాలిత ప్రాంతాల్లో ఢిల్లీ 3.2 శాతం, పుదుచ్చేరి 3.9 శాతం క్రైమ్ రేటుతో సైబర్ నేరాలకు హాట్‌స్పాట్‌లుగా మారాయి. ఢిల్లీ పోలీసుల డేటా ప్రకారం, 2024లో సైబర్ మోసాల ద్వారా ఢిల్లీ వాసులు రూ. 817 కోట్లు నష్టపోయారు. 2025లో జూన్ 30 నాటికి మొదటి ఆరు నెలల్లోనే రూ. 70.64 కోట్లు కోల్పోయారు.

దేశంలో సైబర్ నేరాలను అరికట్టేందుకు కేంద్ర ప్రభుత్వం సమగ్ర చర్యలు చేపడుతోందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి నిత్యానంద రాయ్ ఇటీవల లోక్‌సభకు తెలిపారు. ఇందులో భాగంగా 'ఇండియన్ సైబర్ క్రైమ్ కోఆర్డినేషన్ సెంటర్' ఏర్పాటు చేశామని, ఆన్‌లైన్‌లో ఫిర్యాదుల కోసం 'నేషనల్ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్' ప్రారంభించామని వివరించారు. దీంతో పాటు, మహిళలు, చిన్నారులపై జరిగే సైబర్ నేరాలపై ప్రత్యేకంగా దృష్టి సారించేందుకు పోలీస్ విభాగాల్లో ప్రత్యేక యూనిట్లను కూడా ఏర్పాటు చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

# నాగార్జున సాగర్‌కు పోటెత్తిన వరద 18 గేట్లు ఎత్తివేత

**వేదన్యూస్ డెస్క్:**

భారీ వర్షాలు, వరదల నేపథ్యంలో కృష్ణా నదికి వరద పోటెత్తింది. జూరాల నుంచి మొదలుకుంటే నాగార్జున సాగర్ వరకు కృష్ణా నది ఉధృతంగా ప్రవహిస్తోంది. భారీ వరదకు నాగార్జున సాగర్ నిండు కుండలా మారింది. దీంతో అధికారులు ప్రాజెక్టు 18 గేట్లు 5 అడుగుల మేర ఎత్తి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. జలాశయం పూర్తి స్థాయి నీటిమట్టం 590 అడుగులు కాగా, ప్రస్తుత నీటిమట్టం 589.50 అడుగులుగా ఉంది. సాగర్ ప్రాజెక్టు పూర్తి నీటినిల్వ 312.04 టీఎంసీలు కాగా, ప్రస్తుత నీటినిల్వ 310.55 టీఎంసీలుగా ఉంది. నాగార్జున సాగర్ ప్రాజెక్టు ఇన్‌ఫ్లో, ఔట్ ఫ్లో 1,86,624 క్యూసెక్కులుగా ఉంది.



# బీసీ గర్జన సభ వాయిదా వేసిన బీఆర్ఎస్



**వేదన్యూస్ డెస్క్:**

స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అమలుకు ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలనే ఉద్దేశ్యంతో బీఆర్ఎస్ పార్టీ కథన భేరి పేరిట నిర్వహించ తలపెట్టిన బీసీ గర్జన సభను మరోసారి వాయిదా వేసింది. భారీ వర్ష సూచన నేపథ్యంలో కరీంనగర్ వేదికగా నిర్వహించ తలపెట్టిన ఈ భారీ బహిరంగ సభను వాయిదా వేస్తున్నట్లు ప్రకటించింది. ఈ మేరకు కరీంనగర్ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ పార్టీ నేత గంగుల కమలాకర్.. తన ఎక్స్ ఖాతా వేదికగా ఈ ప్రకటన చేశారు. భారీ వర్ష సూచన కారణంగానే ఈ సభను వాయిదా వేసినట్లు ఆయన తెలిపారు. రాష్ట్రంలో భారీ వర్షాలు కురుస్తున్నాయని.. అందులో భాగంగా ఆగస్ట్ 14, 15, 16, 17 తేదీల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ ఇప్పటికే సూచించిందని వివరించారు. ఈ క్రమంలో ఈ కథన భేరి సభను వాయిదా వేసినట్లు తెలిపారు. అయితే వాతావరణం అనుకూలించిన తర్వాత ఈ సభను నిర్వహించాలని పార్టీ అగ్రనాయకత్వం భావిస్తుందని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ఈ కథనభేరి సభను మళ్లీ ఎప్పుడు నిర్వహించనున్నది మరికొద్ది రోజుల్లో నిర్ణయించి.. ప్రకటిస్తామని మంత్రి గంగుల కమలాకర్ పేర్కొన్నారు. ఈ విషయాన్ని పార్టీ నేతలు, కార్యకర్తలు గమనించాలని సూచించారు. అసలు అయితే ఆగస్ట్ 8వ తేదీన కరీంనగర్ వేదికగా ఈ కథన భేరీ సభ నిర్వహించాలని బీఆర్ఎస్ పార్టీ నాయకత్వం తొలుత నిర్ణయించింది. కానీ ఎందుకో.. ఈ సభను ఆగస్ట్ 14వ తేదీకి వాయిదా వేసినట్లు ప్రకటించింది. కానీ భారీ వర్షాల నేపథ్యంలో ఈ సభను మరోసారి వాయిదా వేశారు. ఈ సభ ఏర్పాటుపై వాయిదాల పర్వం కొనసాగడానికి వెనుక ఉన్న కారణాలు ఏమై ఉంటాయనే ఒక చర్చ అయితే రాజకీయ వర్గాల్లో బలంగా సాగుతోంది.

# పుట్టినరోజు జరుపుకుని మరుసటి రోజే మృతి చెందిన ఆర్మీ జవాన్..!

**వేదన్యూస్ డెస్క్:**



ఖమ్మం జిల్లా కారేపల్లి మండలం సూర్య తండాలో విషాదం నెలకొంది. తండాకు చెందిన బానోతు అనిల్ ఆర్మీ జవాన్‌గా కాశ్మీర్‌లోని శ్రీనగర్‌లో విధులు నిర్వహిస్తున్నారు. గత రెండు రోజుల క్రితం తోటి జవాన్లతో పెట్రోలింగ్ చేస్తుండగా.. ప్రమాదవశాత్తు వాహనం లోయలో పడిపోయింది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడ్డ అనిల్.. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ తుది శ్వాస విడిచాడు. ఈ మేరకు ఆర్మీ అధికారులు అనిల్ సోదరుడికి సమాచారం ఇచ్చారు. తమ సోదరుడు మరణంతో ప్రసాద్ స్పృహ తప్పి పడిపోయాడు అతన్ని అస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. అనిల్ మరణ వార్తను కుటుంబంలో తల్లికి భార్యకు తెలియకుండా జాగ్రత్త పడుతున్నారు.. ఆదివారం(ఆగస్టు 10) రోజున అనిల్, తన పుట్టినరోజుసందర్భంగా తోటి జవాన్లతో కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నాడు. కుటుంబ సభ్యులకు వీడియో కాల్ చేసి, తన భార్య, 7 నెలల బాబుతో సంతోషాన్ని పంచుకున్నాడు. ఈ ఆనందాన్ని పంచుకున్న మరునాడే ఆర్మీ వాహనం లోయలో పడి అనిల్ మృతి చెందడంతో తీవ్ర విషాదాన్ని నింపింద. ఈ విషయాన్ని తెలుసుకున్న తన కుటుంబ సభ్యులు స్నేహితులు గ్రామస్తులు కన్నీరు మునీరుగా విలపిస్తున్నారు. సూర్య తండా గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి. అనిల్ మృతి వారి కుటుంబానికే కాదుస్నేహితులకు, గ్రామానికి కూడా తీరని లోటని స్థానికులు అంటున్నారు. అనిల్ కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలని అనిల్ స్నేహితులు కోరుతున్నారు.

# ఖజానా జువెలర్స్ లో దొంగల బీభత్సం... సిబ్బందిపై కాల్పులు

**వేదన్యూస్ డెస్క్:**

హైదరాబాద్ శివారు చందానగర్ లో దొంగలు రెచ్చిపోయారు. చందానగర్ లోని ప్రముఖ నగల దుకాణం ఖజానా జువెలర్స్ లో దొంగలు దోపిడీకి యత్నించారు. దొంగతనానికి పాల్పడుతున్న సమయంలో అడ్డుకున్న సిబ్బందిపై దాడి చేయడమే కాకుండా, కాల్పులు కూడా జరిపారు. ఈ కాల్పుల్లో సిబ్బందికి గాయాలయ్యాయి. వెంటనే పోలీసులు రంగప్రవేశం చేయడంతో దొంగలు పారిపోయారు. పరారైన దొంగల కోసం పోలీసులు గాలిస్తున్నారు. గాయపడిన వారిని చికిత్స కోసం సమీప ఆసుపత్రికి తరలించారు. దొంగలు తొలుత ఖజానా జువెలర్స్ గేట్ వద్ద ఉన్న సిబ్బందిని గాయపరిచి లోపలకు ప్రవేశించారు. ఆ తర్వాత షాపు లోపల ఎదురు తిరిగిన సిబ్బందిపై కాల్పులు జరిపారు. లాకర్ కీ ఇవ్వడానికి నిరాకరించిన అసిస్టెంట్ మేనేజర్ సతీశ్ పై కాల్పులు జరిపారు. దీంతో ఆయన కాలులోకి ఒక బుల్లెట్ దూసుకెళ్లింది. షాపు లోపల నగలు ఉన్న స్టాల్స్ ను పగులగొట్టారు. తుపాకీతో సీసీ కెమెరాలను ధ్వంసం చేశారు. ఈ దొంగల ముఠాలో మొత్తం ఆరుగురు సభ్యులు ఉన్నట్టు సమాచారం. దొంగలు దొరికిన కాడికి దోచుకుని పరారయ్యారు. ఎక్కువగా వెండి వస్తువులు చోరీకి గురైనట్టు సమాచారం. దొంగలు జహీరాబాద్ వైపు పారిపోగా... జిల్లా సరిహద్దు పోలీసులను అధికారులు అప్రమత్తం చేశారు. పరారైన దుండగుల కోసం 10 ప్రత్యేక బృందాలతో పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. ఈ ఘటనతో చందానగర్ లో భయానక వాతావరణం నెలకొంది.

Edited, Printed, Published and Owned by Lingabatthini Krishna Printed at Bhavani Enterprises, H.No 16-6-198/B, Perukawada, Warangal, 506002, Telangana State. Published at H.No. 17-3-180, Near Rama Swamy Temple, Warangal Dist, 506002 Telangana State. Editor : Lingabatthini Krishna, Phone : 9701923260. e-Mail : vedhanews22@gmail.com. RNI No : TELTEL/2022/83073